క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అర్ధమండల దీక్షలు

ఆసిఫాబాద్అర్బన్: పవిత్ర శ్రావణమాసం పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయస్వామి ఆలయంలో భక్తులు హనుమాన్ అర్ధమండల దీక్షలు స్వీకరించారు. ఈ సందర్భంగా అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, రుద్రాభిషేకం, స్వామివారికి మన్యసూక్తసహిత అభిషేకం, మంగళహారతి, మహామంత్రపుష్పం నిర్వహించి అనంతరం స్వాములకు మాలధారణ చేశారు. దీక్షా సమయంలో స్వాములు పాటించాల్సిన నియమ నిబంధనలను అర్చకులు వివరించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పిన్నా వివేక్, రూప్‌నార్ రమేశ్, నారాయణమూర్తి, మధు, లక్ష్మణమూర్తి, రాధాకృష్ణచారి, వెంకటేశ్వర్లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసు కళాబృందం నూతన చట్టాలు, ట్రాఫిక్ రూల్స్, సైబర్‌నేరాలు, మహిళలపై వేధింపులకు సంబంధించిన చట్టాలపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏఎస్సై ప్రభాకర్, కళాబృందం సభ్యులు రాంచందర్, రోహిత్, వెంకటేశ్, చంద్రశేఖర్, రజిత పాల్గొన్నారు.

పఠన సామర్థ్యాలు పెంపొందించాలి

బెజ్జూర్: విద్యార్థుల్లో పఠన సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో రమేశ్ అన్నారు. మంగళవారం బెజ్జూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. 1వ, 2వ తరగతి విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాల పెంపునకు రూమ్ టు రీడ్ అందించిన వికాసం 1, వికాసం 2 పుస్తకాలు ఉపయోగపడతాయన్నారు. కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, సీఆర్పీ సత్యనారాయణ, శ్రీనివాస్, రూమ్‌టురీడ్ ప్రతినిధి పల్లె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులు పండ్ల తోటలపై దృష్టి పెట్టాలి



పండ్ల తోటను పరిశీలిస్తున్న దీపక్ తివారి

జైనూర్: రైతులు పంట సాగుతో పాటు పండ్ల తోటలపై దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం మండలంలోని బూసిమెట్టలో రైతులు దొంగ్రె దత్తాత్రి సాగు చేసి పండ్ల తోటను పరిశీలించారు. తోటకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం నగేశ్, ఎంపీడీవో శ్రీనివాస్, డీఆర్‌డీవో దత్తారావు తదితరులు పాల్గొన్నారు.

జోడేఘాట్‌ను సందర్శించిన జెడ్పీ సీఈవో



నివాళులర్పిస్తున్న లక్ష్మీనారాయణ

కెరమెరి: మండలంలోని జోడేఘాట్ గ్రామాన్ని మంగళవారం జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మీనారాయణ సందర్శించారు. కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన సమాధిపై పూలు చల్లి మొక్కుకున్నారు. అనంతరం మ్యూజియం తిలకించారు. అనంతరం స్వచ్ఛదనం –పచ్చదనంలో భాగంగా మ్యూజియం ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీవో అంజద్‌పాషా, సూపరింటెండెంట్ సుధాకర్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ ఐక్యానాయక్ ఉన్నారు.

అధికారులకు సన్మానం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులను యాజమాన్యం వివిధ ఏరియాలకు బదిలీ చేయగా మంగళవారం బదిలీపై వెళ్తున్న అధికారులను జీఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఏరియాలోని కై రిగూడ ఓసీపీ ప్రాజెక్టు అధికారిగా పని చేసిన సత్యనారాయణ, ఏరియా ఫైనాన్స్ డీజీఎంగా పని చేస్తున్న రామారావు, జూనియర్ ఫారెస్టు అధికారి నవీన్‌లను సన్మానించారు. జీఎం రవిప్రసాద్, ఎస్‌వోటూజీఎం నరేందర్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియా జీఎం బదిలీ

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా జీఎంగా విధులు నిర్వహిస్తున్న రవి ప్రసాద్‌ను సింగరేణి యాజమాన్యం మార్కెటింగ్ జీఎంగా హైదరాబాద్‌కు బదిలీ చేసింది. ఆయన స్థానంలో శ్రీరాంపూర్ ఏరియా ఐకే గ్రూప్ ఏజెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.శ్రీనివాస్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఘనంగా జయశంకర్ జయంతి



వాంకిడి: జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల సిబ్బంది

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) ఆధ్వర్యంలో మంగళవారం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చంద్రయ్య మాట్లాడుతూ ఆంధ్ర పాలకుల దుశ్చర్యలను ఖండిస్తూ నిధులు, నియామకలు తెలంగాణ వాసులకే చెందాలని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు డ్రాఫ్ట్‌ను తయారు చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో బోధన సిబ్బంది సురేందర్, సంతోష్, రాజమౌళి, శ్రీధర్, కిరణ్ కుమార్, తిరుపతి, సత్యం, అశ్విని, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో, ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కవిత మాట్లాడుతూ జయశంకర్ తెలంగాణ సిద్ధాంత కర్త అని కొనియాడారు. డీటీ లలిత, ఆర్ఐ నాందేవ్, శృతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ డాక్టర్ కొత్తపల్లి జయశంకర్ 90వ జయంతి జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘం భవనంలో జయశంకర్ చిత్రపటానికి పూల దండలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ పోరాటంలో జయశంకర్ చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కర్నాగౌడ్, విశ్రాంత ఉద్యోగులు పోచన్న, వినోద్, రాజేశ్వర్, సిరాజ్‌హక్, నర్సయ్య, మధుకర్, వెంకటేశ్, వెంకన్న, కనకమ్మ, పద్మ, సత్తమ్మ, సుమతి పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి నిర్వహించారు. అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ విద్యావంతులు, జ్ఞానవేదిక ద్వారా విద్యార్థులు, మేధావులను ఏకతాటి పైకి తీసుకొచ్చి తెలంగాణ సాధనకు పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్‌పాషా, సిబ్బంది సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

కౌటాల: ప్రొఫెసర్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త అని కాగజ్‌నగర్ మార్కెట్ చైర్మన్ సిద్దల దేవయ్య అన్నారు. మంగళవారం మండలంలోని తలోడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక ఎంపీడీవో కార్యాలయం, కౌటాల పంచాయతీ కార్యాలయంలో జయంతి నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, కవిత తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని మంగళవారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో వేముల మల్లేశ్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఎంపీవో సుధాకర్ రెడ్డి, టీపీ సాగర్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

సిర్పూర్(టి): ప్రొఫెసర్ జయశంకర్ జయంతి మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సత్యనారాయణల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బెజ్జూర్: మండలంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ భుమేశ్వర ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయబ్ తహసీల్దార్ భీమ్లా నాయక్, సీనియర్ అసిస్టెంట్ అచ్యుత్ రావు, జూనియర్ అసిస్టెంట్ జావిద్, రికార్డ్ అసిస్టెంట్ శ్రీహరి, అటెండర్ కృష్ణమూర్తి, సిబ్బంది ఉన్నారు.

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని సింగరేణి అధికారులు ఘనంగా నిర్వహించారు. ఏరియా జీఎం రవి ప్రసాద్‌తో పాటు ఇతర విభాగాల అధికారులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఎస్‌వోటూజీఎం నరేందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

మండలంలోని ఇందిరానగర్ సమీపంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఘనంగా నిర్వహించారు.

కాగజ్‌నగర్‌రూరల్: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి జీవితాంతం కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్ ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు జనార్దన్, రాజేశ్వర్, శారద, దేవేందర్, వెంకటేశం, కృష్ణవేణి, రోజ్‌మేరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ జయంతి..
గద్దర్, సుష్మాస్వరాజ్‌ల వర్ధంతి

కాగజ్‌నగర్‌రూరల్: తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ జయంతి, యుద్ధనౌక గాయకుడు గద్దర్, సుష్మాస్వరాజ్‌ల వర్ధంతి వేడుకలను మంగళవారం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలంగాణకు వారు చేసిన సేవలను కొనియాడారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, ఏఎస్ఆర్ మూర్తి, సీతారాం, పురుషోత్తం, నాగేశ్వర్‌రావు, ఫారూక్, జబ్బార్‌ఖాన్, అన్వర్, హబీబ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సిర్పూర్(టి)లో..



తిర్యాణి: నివాళులర్పిస్తున్న ఎంపీడీవో



కెరమెరి: నివాళులర్పిస్తున్న సిబ్బంది



కౌటాల: పూలమాల వేస్తున్న అధికారులు



బెజ్జూర్‌లో..



దహెగాం: తహసీల్దార్ కార్యాలయంలో..



రెబ్బెన: జీఎం కార్యాలయంలో..

తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ అనసూర్య

దహెగాం: తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూర్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ –2 కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ముందుగా చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పుట్టిన శిశువుకు ముర్రుపాలు పట్టాలని, అందులో రోగనిరోధక శక్తి ఉంటుందన్నారు. ఆరు నెలల పాటు తల్లి పాలే పట్టించాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, పార్వతి, మమత, విజయలక్ష్మి, కల్పన పాల్గొన్నారు.

కెరమెరి: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని మోడీ సెక్టార్‌లో అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారుల తలపై అక్షింతలు చల్లి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తల్లి పాల ప్రాధాన్యతపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత గర్భిణీలు, తల్లులకు అవగాహన కల్పించారు. పోషణ్ అభియాన్ అధికారి తౌఫిక్, అంగన్‌వాడీ కార్యకర్తలు సావిత్రి, బొజ్జుబాయి, పద్మ, లూర్దమేరి, మీరాబాయి, అయ్యూబాయి, సరోజ తదితరులు ఉన్నారు.

కౌటాల: పౌష్టికాహారంతోనే గర్భిణీలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షకీరా బేగం అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని సదాశివపేట కాలనీలో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణీలు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆమె వెంట అంగన్‌వాడీ టీచర్ జీజాబాయి తదితరులు పాల్గొన్నారు.



కెరమెరిలో..

మరమ్మతులు లేక తిప్పలు

- భారీ వర్షాలకు కొట్టుకుపోయిన చీలపల్లి రోడ్డు
- కోతకు గురై తీవ్రంగా దెబ్బతిన్న కల్వర్టులు
- ఆస్పత్రికి తీసుకెళ్తుండగా వాహనం ఒర్రెలో చిక్కుకొని గర్భిణి మృతి



భారీ వర్షాలకు కొట్టుకుపోయిన చీలపల్లి కల్వర్టు

సిర్పూర్(టి): మండలంతో పాటు ఎగువ ప్రాంతం మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని సిర్పూర్(టి) –చీలపల్లి రోడ్డుతో పాటు రెండు కల్వర్టులు పూర్తిగా కొట్టుకుపోయాయి. దీంతో ఈ రోడ్డు గుండా మండలకేంద్రంతో పాటు కాగజ్‌నగర్ పట్టణానికి ప్రతీరోజు ప్రయాణాలు సాగించే చీలపెల్లి, పూసిగూడ, లింబుగూడ, రావన్‌పల్లి, మేడిపల్లితో పాటు కాగజ్‌నగర్ మండలంలోని చిన్నమాలిని, మాలిని గ్రామాల ప్రజలకు రెండు రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్డు మరమ్మతులను అధికారులు పట్టించుకోకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తాత్కాలికంగా మొరం, మట్టిని వేసి ద్విచక్రవాహనాలు, ఆటోలు వెళ్లేలా చేశారు. ఏటా వర్షాకాలంలో రోడ్డు, కల్వర్టులు కోతకు గురవుతున్నా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అత్యవసర సమయాల్లో తప్పని ఇబ్బందులు..

మండలకేంద్రం నుంచి చీలపల్లి గ్రామం మీదుగా వెళ్లే ప్రధాన రహదారి గుండా మండలంలోని చీలపెల్లి, పూసిగూడ, లింబుగూడ, రావన్‌పల్లి, మేడిపల్లి గ్రామాలతో పాటు కాగజ్‌నగర్ మండలం చిన్నమాలిని, మానిక్‌పటార్, మాలిని గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. సిర్పూర్(టి) –చీలపల్లి గ్రామాల మధ్యలోని అటవీప్రాంతంలో ఉన్న రహదారి పూర్తిగా మట్టి రోడ్డు కావడం భారీ వర్షాలకు రెండు కల్వర్టులు, మట్టిరోడ్డు కొట్టుకుపోవడంతో ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ సైతం ఆయా గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఏటా భారీ వర్షాలకు ఆయా గ్రామాలకు అంబులెన్స్ సైతం వెళ్లలేని పరిస్థితి ఉన్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే చీలపల్లి గ్రామ శివారు నుంచి ద్విచక్రవాహనం లేదా ఎడ్లబండ్ల సహాయంతో మండలకేంద్రానికి చేరుకోవాల్సి వస్తుంది. సిర్పూర్(టి) మండలం మేడిపల్లి పంచాయతీ పరిధిలోని లింబుగూడ గ్రామానికి చెందిన వెడ్మ మనీషా అనే గర్భిణీకి ఆదివారం ఫిట్స్ రాగా టాటాఏస్ వాహనంలో సిర్పూర్(టి) ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. రాత్రిపూట వాహనం చీలపల్లి సమీపంలోని శివసంది ఒర్రె వద్ద చిక్కుకోవడంతో ఒర్రెను దాటించేందుకు జాప్యం జరిగింది. దీంతో మనీషాను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సోమవారం వేకువజామున మృతి చెందింది. ఏటా వర్షాకాలంలో ఇలాంటి పలు సంఘటనలు జరుగుతున్నాయని, జిల్లా ఉన్నతాధికారులు సమస్యను గుర్తించి రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి



సిర్పూర్(టి): మండల కేంద్రం నుంచి చీలపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారితో పాటు కల్వర్టులు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోగా వెంటనే రోడ్డు సౌకర్యం కల్పించాలని చీలపల్లి గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుర్పం అర్జు, గ్రామస్తులు లింగమూర్తి, ఓదేలు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న మల్టీపర్పస్ కార్మికులు

తిర్యాణి: గ్రామపంచాయతీలో పని చేస్తున్న మల్టీపర్పస్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో మంగళవారం ఎంపీడీవో వేముల మల్లేశంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేసి కనీస వేతనం జీవో నంబర్60 ప్రకారం అందించాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మల్టీపర్పస్ కార్మికులకు ఇచ్చిన హామీలు నేరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న ఒక్కరోజు సమ్మె నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ మల్టీపర్పస్ కార్మికులు గుండం శంకర్, సుద్దాల తిరుపతి, మారుతి, సోము తదితరులు ఉన్నారు.

పంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

కౌటాల: గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో మహేందర్‌రెడ్డికి మండలంలోని పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. పంచాయతీ సిబ్బంది, కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సంఘం నాయకులు మోరేశ్వర్, నాగేష్, ప్రకాశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



సిర్పూర్ (టి): ట్యాంకు శుభ్రం చేయిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మోతుగూడ, బూర్గుడతో పాటు పలు గ్రామ పంచాయతీల్లో పర్యటించారు.

తిర్యాణి: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఎంపీడీవో వేముల మల్లేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మొక్కలు నాటారు.

పెంచికల్‌పేట్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్ రావు అన్నారు. మంగళవారం ఎల్కపల్లి, ఎల్లూర్, పెంచికల్‌పేట్ గ్రామపంచాయితీలను ఆయన పరిశీలించారు.

కౌటాల: పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీవో మహేందర్ రెడ్డి అన్నారు. స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని తలోడి గ్రామంలో అవగాహన ర్యాలీ తీశారు.

రెబ్బెన: గ్రామాల్లో పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీవో భిక్షపతి అన్నారు. మంగళవారం గోలేటి గ్రామపంచాయతీ పరిధి సోనాపూర్ గ్రామాన్ని సందర్శించారు.

సిర్పూర్(టి): స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధి శివపూర్, మండలంలోని లోనవెల్లి గ్రామాల్లో అధికారులు నీటి నాణ్యతను పరిశీలించి క్లోరినేషన్ చేయించారు. గ్రామాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అనంతరం నీటి ట్యాంకులు, గ్రామంలోని పరిసర ప్రాంతాలను పరిశీలించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పి.ప్రభాకర్, ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోహర్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సిర్పూర్(టి) ఎఫ్ఆర్‌వోగా ఇక్బాల్ హుస్సేన్

సిర్పూర్(టి): సిర్పూర్(టి) అటవీశాఖ రేంజ్ అధికారిగా ఇక్బాల్ హుస్సేన్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం నీల్వాయి అటవీశాఖ రేంజ్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించి బదిలీపై సిర్పూర్(టి)కి వచ్చారు. రేంజ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి పలు రికార్డులు పరిశీలించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్ బదిలీపై బెల్లంపల్లికి వెళ్లారు.

చికిత్స పొందుతూ వ్యవసాయ కూలీ మృతి

భువనగిరిరూరల్: పత్తి చేనుకు రసాయన మందులు పిచికారీ చేసి అస్వస్థతకు గురైన వ్యవసాయ కూలీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. వివరాలు.. ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం అందులగూడెం గ్రామానికి చెందిన కొరనే తిరుపతి(36) కుటుంబ సభ్యులతో కలిసి రెండు నెలల క్రితం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం వీరవెల్లి గ్రామానికి వలస వచ్చాడు. అదే గ్రామానికి చెందిన పాలిశెట్టి ప్రవీణ్ వద్ద వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం పత్తి చేనులో రసాయన మందులు పిచికారీ చేసిన తిరుపతి ఇంటికి రాగానే వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

ఎస్సీ డిక్లరేషన్ హామీలు వెంటనే అమలు చేయాలి

రెబ్బెన: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేవెళ్ల సభలో ప్రకటించిన ఎస్సీ డిక్లరేషన్ హామీలకు అనుగుణంగా నిధులు కేటాయించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అంజనేయలు గౌడ్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ రామ్మోహన్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు.

గుడుంబా పట్టివేత

రెబ్బెన: మండలంలోని ఎడవెల్లి గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న 5లీటర్ల గుడుంబాను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తనిఖీల్లో ఎడవెల్లి గ్రామానికి చెందిన కమ్మరి చందు 5 లీటర్ల గుడుంబా తరలిస్తూ పట్టుబడ్డాడు. గుడుంబాను స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఏఎస్సై అశోక్ ఉన్నారు.

ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సాంబశివరావు

తిర్యాణి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీగా తిర్యాణి మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు సాంబశివరావును నియమించినట్లు డీఈవో అశోక్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సన్మానం

రెబ్బెన: రెబ్బెన తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రామ్మోహన్‌రావును మంగళవారం మండలంలోని బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాతో సన్మానించారు.